క్లుప్తంగా

వారాంతపు సంత ప్రారంభం

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలో శుక్రవారం వారాంతపు సంత ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సంతను ప్రారంభించారు. సంతలో 33మంది వ్యాపారస్తులు తమ స్టాళ్లను ఏర్పాటు చేసుకుని కూరగాయలు, నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచారు. చుట్టుపక్కల గ్రామాలైన సూరంపేట, నర్సింహులపల్లి, పులుకుర్తి, పోచారం గ్రామాల ప్రజలు వారికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేసుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న లేగదూడల పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు

ఎల్కతుర్తి : అక్రమంగా తరలిస్తున్న మూడు లేగదూడలను భీమదేవరపల్లి మండలం వంగర పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన ఎండీ.జాఫర్, ఎండీ. ఇబ్రహీం, కనకం సదానందం జూన్ 7న వచ్చే బక్రీద్ పండుగకు మాంసం విక్రయించాలనే ఉద్దేశంతో లేగదూడలను హుస్నాబాద్ మార్కెట్‌లో కొనుగోలు చేసి జమ్మికుంటకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో రామ్‌నగర్ తండా వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్కార్పియో, ఆటో ఢీ

నడికూడ : కంఠాత్మకూరు– వరంగల్ ప్రధాన రహదారి రామకృష్ణపూర్ వద్ద రోడ్డు సమీపంలో ఉన్న రైతులు మొక్కజొన్న సొప్ప, పత్తికట్టె, వరి పంట మొదళ్లకు నిప్పు పెట్టడంతో పొగకమ్ముకుంది. ఈ క్రమంలో కంఠాత్మకూరు నుంచి వరంగల్‌కు వెళ్తున్న స్కార్పియోను వరంగల్ నుంచి పరకాలకు వస్తున్న ఆటో ఢీ కొట్టింది. దీంతో పలువురికి గాయాలు కావడంతో స్థానికులు 108 ద్వారా వరంగల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముళ్లచెట్ల తొలగింపు



శాయంపేట : మండలంలోని మాందారిపేట, సూరంపేట, గట్లకానిపర్తి గ్రామాల్లో రోడ్డుకు అడ్డుగా ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదలను శుక్రవారం శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. కొద్ది రోజులుగా ముళ్లపొదలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని జేసీబీ సహాయంతో తొలగించినట్లు చెప్పారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఐనవోలు : టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన స్వగ్రామం మండలంలోని పంథిని గ్రామంలో అభిమానులు శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లేషం, మహేందర్, శ్రీనివాస్, రమేష్, స్వామి, రాజు, శ్రీను, రాజు, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవ పూజలు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్ర లక్ష్మీదేవి హోమ పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, బిక్కి మురళీ, గిరగాని నర్సయ్య, పసునూరి వెంకన్న, ఎలంశెట్టి ప్రసాద్ దంపతులతోపాటు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణ ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని అట్టహాసంగా జరిపించారు.

నేత్రదానం

దుగ్గొండి : మండలంలోని మద్రిపల్లికి చెందిన దానం శంకరయ్య (75) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందగా ఆయన నేత్రాలను బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఎల్‌వీ ఆస్పత్రికి దానం చేసింది. శంకరయ్య నేత్రాలను వారి కుమార్తెల అంగీకారంతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ట్రస్టు నేత్ర వైద్య నిపుణుడు నరేందర్ సేకరించి భద్రపర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ మాట్లాడారు. నేత్రదానం అభినందనీయమని చెప్పారు.

సన్మానం

నర్సంపేట : ఆర్టీసీ బస్సులో తరచూ ప్రయాణం చేసిన నర్సంపేటకు చెందిన చల్ల సోమనర్సయ్యను, కమలాపురం మండలానికి చెందిన ముత్తినేని శ్రీలతను స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శుక్రవారం పుష్పాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం డిపో ఉద్యోగులతో మాట్లాడారు.

కార్యాలయాలకు మోక్షమెప్పుడో?



దేవస్థానానికి సంబంధించిన భవనంలో ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్



హాస్టల్‌లో కొనసాగుతున్న ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు

● తొమ్మిదేళ్లు సమీపిస్తున్నా స్పందించని పాలకులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఐనవోలు : చిన్న మండలాల ఏర్పాటుతో అభివృద్ధి చెందడంతో పాటు పరిపాలన సౌలభ్యం మెరుగుపడుతుందనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం 11 అక్టోబర్ 2016న మండలాలను పునర్విభజన చేసింది. దీంతో మండలాల అభివృద్ధి జరుగుతుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎంతో సంతోషపడ్డారు. కానీ వారి సంతోషం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. మండలం ఏర్పడి సుమారు తొమ్మిదేళ్లు సమీపిస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. శాశ్వత భవనాల నిర్మాణానికి సరిపోయే ప్రభుత్వ స్థలం మండల కేంద్రంలో ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందుతు పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వర్ధన్నపేట నుంచి 9 గ్రామాలు, హనుమకొండ నుంచి 4 గ్రామాలు, జఫర్‌ఘడ్ నుంచి 2 గ్రామాలతో మూడు మండలాల సమాహారంగా 15 గ్రామాలతో ఐనవోలు మండలం ఏర్పాటు అయ్యింది. తరువాత కొన్ని పరిణామాల వలన ఏర్పడిన 2 గ్రామాలతో కలిపి ప్రస్తుతం 17 గ్రామాలతో మండలంగా కొనసాగుతోంది. సుమారు 50 వేల జనాభా కలిగి ఉన్న మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్లిఖార్జున స్వామి ఆలయ తూర్పు ద్వారం దగ్గర దేవస్థానానికి సంబంధించిన భవనంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయగా దర్శనానికి వచ్చే తమకు ఇక్కట్లు తప్పడం లేదని భక్తులు వాపోతున్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడాల్సిన ఆలయ ప్రాంగణంలో భయానక వాతావరణం ఏర్పడుతుందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్ భవనంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

రవాణా సౌకర్యం లేదు

మండలంలో 17 గ్రామాలుండగా మండల కేంద్రానికి వచ్చిపోయేందుకు సరైన బస్సు సౌకర్యం లేదు. ఇప్పటికీ మండల కేంద్రానికి రావాలంటే స్వంత వాహనాలపైనే వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలి



గ్రామస్తులం ఏదైనా పనిపై మండల కార్యాలయాలకు వెళ్లాలంటే సొంత వాహనాలపైనే వెళ్లాలి. లేదంటే అద్దెకు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రవాణా భారం అధికమవుతుంది. అన్ని గ్రామాలను కలుపుతూ బస్సు రవాణా సౌకర్యం కల్పించాలి.

\- యాకర నర్సింగం, నందనం గ్రామం

శాశ్వత భవనాలు నిర్మించాలి



మండల కేంద్రంలో శాశ్వత భవనాల నిర్మాణానికి సరిపోయే ప్రభుత్వ స్థలం ఉంది. ఒకే చోట మండల కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. తొమ్మిదేళ్లుగా పాలకులు నిర్లక్ష్యం చేయడం సరికాదు. ప్రభుత్వం దృష్టిసారించాలి.

\- కాడబోయిన లింగయ్య, సీపీఎం జిల్లా సభ్యుడు, ఐనవోలు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం

మండల కేంద్రంలో కార్యాలయాల నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న స్థలాన్ని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకెళ్లాము. ప్రస్తుతం ఉన్నతాధికారుల సూచన మేరకు కేటాయించిన భవనాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం మేరకు పనులు చేపడుతాం.

\- విక్రమ్ కుమార్, తహసీల్దార్, ఐనవోలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేలేరు : ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



శాయంపేట : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేలేరు : మండలంలోని పీచర జెడ్పీఎస్ఎస్‌లో 1997–1998 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 28 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. తమకు విద్యా భోదన చేసిన గురువులను శాలవాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, మల్కిరెడ్డి సింగారెడ్డి, సాంబయ్య, త్రివేణి, రాజమ్మ, రమణ, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 1996–1997 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు గుడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో ఆత్మయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో, మెమొంటోలతో సత్కరించారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, శ్రీనివాసాచారి, ఉమామహేశ్వర్, రాజమల్లయ్య, మోహన్ రెడ్డి, సమ్మయ్య, మహిముద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణ రెడ్డి, మాజీ విద్యాకమిటీ చైర్మన్ తడుక రాజయ్య, అప్పటి అటెండర్ సాంబయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లల్లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ధర్మసాగర్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ జోతీర్మయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ కిందఉన్న చెట్లను తొలగిస్తున్న కారణంగా ధర్మసాగర్ సబ్ స్టేషన్ నుంచి వచ్చే దేవునూర్ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 08 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వేలేరు : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో శనివారం అత్యవసర మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని అయా గ్రామాలకు, అన్ని ఫీడర్‌లలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



శాయంపేట : బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం రాజు

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పెద్దకోడెపాక జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్య నాయక్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక, జోగంపల్లి గ్రామాల్లో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ.. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రూ.6000 రవాణా భత్యం కూడా ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కొండ సాత్విక 600 మార్కులకు గాను 528, ఎస్.శివకుమార్ 498, తృతీయ స్థానంలో టి.అన్వేష్, ఎమ్.సంగీత్‌కుమార్ 481 మార్కులు సాధించినందుకు వారిని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అన్న వసంత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్‌లో మహిళా సంఘాలతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉపాధ్యాయులు ఉమా, గోపాల్‌రెడ్డి, మాధవి, రమ్య, మణికంఠ గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు కొత్తపల్లి స్వప్న, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ములుగు మండలంలోని దేవగిరిపట్నంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానిబాబా దర్గాలో ప్రచారం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ అమీద్ చేతుల మీదుగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ఆత్మకూరు : పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండెం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామంలో పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పుష్పలత, నరసింహస్వామి, వసంత, కవిత పాల్గొన్నారు.

సమన్వయంతోనే సంఘాల అభివృద్ధి

● సహ వికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద



సంగెం : సభ్యుల నడుమ సమన్వయంతోనే సహకార సంఘాలు అభివృద్ధి సాధించగలవని సహ వికాస సంస్థ అధ్యక్షురాలు కాసర్ల జయప్రద తెలిపారు. మండలంలోని గవిచర్లలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంజనేయ పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార సమితి ప్రథమ వార్షికోత్సవ మహాసభను శుక్రవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆదాయం నుంచి కొంత పొదుపు చేయడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతినెలా నియమిత పొదుపు చేసుకుంటే భవిష్యత్తుకు ధీమా ఉంటుందని చెప్పారు. సమితి పరిధిలోని 5 పొదుపు సంఘాల్లో 3383 మంది సభ్యులుండగా పొదుపు రూ.5.29 కోట్లు కాగా బోనస్ రూ.7.90 కోట్లు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గుండెబోయిన ఎల్లాగౌడ్, మేనేజర్ లక్ష్మణ్, డీఓ నవీన్ పాల్గొన్నారు.

అవగాహనతో డెంగీ నివారణ

నర్సంపేట : అవగాహనతో డెంగీ నివారణకు బాటలు వేయొచ్చని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి సరోజ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా చెన్నారావుపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆమె మాట్లాడారు. ప్రజలు డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. దోమ కాటుతో డెంగీ సోకే అవకాశం ఉందన్నారు. అధిక జ్వరం, తీవ్రమైన కీళ్లనొప్పులు, కండరాల ఇబ్బందులు, చర్మంపై దద్దుర్లు, తదితర లక్షణాలతో బాధపడే ప్రజలు సత్వరమే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్లు రామెల్, కీర్య, ప్రేమలత, సిబ్బంది ఎస్తేర్, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

● ఏసీపీ సతీశ్‌బాబు



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్‌బాబు

పరకాల : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు విక్రయించాలని ఏసీపీ సతీశ్‌బాబు ఎరువులు, పురుగు మందుల షాపుల డీలర్లకు స్పష్టం చేశారు. పట్టణంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశానికి వెన్నుముక అయినటువంటి రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. విత్తన చట్టం1966, ఎఫ్‌సీఓ 1985, పురుగు మందుల చట్టం 1968 ప్రకారం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలను ధిక్కరించి రైతులను మోసం చేయాలని చూస్తే సంబంధిత డీలర్లపై, వ్యాపారస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరకాల ఇన్‌చార్జ్ ఏడీఏ, ఏఓ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఓ క్రాంతికుమార్, వివిధ మండలాల వ్యవసాయాధికారులు యాదగిరి, గంగాజమున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐనవోలు : జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక కర్షకులతో పాటు అన్నివర్గాల ప్రజలు పాల్గొని శ్రామిక వర్గాల పోరాట స్ఫూర్తిని ఎలుగెత్తి చాటాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పంథినిలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మిక, కర్షకుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన ప్రభుత్వాలు శ్రామికులకు తగిన వేతనాలు పెంచకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణలో ఎన్నికల ముందు కార్మిక, కర్షక లోకానికి ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం అయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు పాణి, సూరన్న, మల్లేష్, యాకన్న, మోహన్, నర్సయ్య, దేవేందర్, రమేశ్, కుమార్, చందు, నరసింహస్వామి, రాములు, ప్రకాశ్, ఐలయ్య పాల్గొన్నారు.

పంటమార్పిడితో నేలకు ఆరోగ్యం



ఎల్కతుర్తి : సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాములు



శాయంపేట : ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా రైతులు

● డాక్టర్ సీహెచ్ రాములు

ఎల్కతుర్తి / శాయంపేట : పంట మార్పిడి పాటిస్తే నేల ఆరోగ్యంగా ఉంటుందని శాస్త్రవేత్త సీహెచ్. రాములు అన్నారు. శుక్రవారం మండలంలోని కోతులనడుమ గ్రామంలో గల రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరిపంటలో తక్కువ యూరియా వినియోగించాలన్నారు. దీని ద్వారా సాగు ఖర్చు, నేల, నీరు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసినప్పుడు రసీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రవీందర్‌గౌడ్, శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రశాంత్, ఏఈఓ తిరుపతి, యాదగిరి, కృషి విజ్ఞాన కేంద్రం అధికారి రఘు, రైతులు పాల్గొన్నారు. అలాగే శాయంపేట మండలంలోని గోవిందాపూర్ ప్రజ్వల్ ఫీల్డ్ ఫర్టిలేటర్ కల్పన మహిళా రైతులకు పలు సూచనలు చేశారు. స్థిరమైన వ్యవసాయం, పర్యావరణ వ్యవస్థ సమతుల్యత, నేల ఆరోగ్యం కాపాడుకోవడం వంటి అంశాలపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. అంతకుముందు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఆలయం వరకు పురవీధుల గుండా హనుమాన్ మాలధారులు, భక్తులు రథాన్ని లాగి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. మహిళలు, భక్తులు మంగళహారతులతో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవంలో ఆలయ అర్చకులు హరీషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్ద రథాన్ని లాగుతున్న హనుమాన్ మాలధారులు

బస్సు కొనుగోలుకు మహిళా సంఘం సన్నద్ధం



ఆర్టీసీ ఖాతాకు డబ్బు జమచేస్తున్న ఏపీఎం దేవానంద్, సమాఖ్య సభ్యులు

ఎల్కతుర్తి : మహిళా స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని ప్రభుత్వ నిర్ణయించింది. అందులో భాగంగా భీమదేవరపల్లి మండల సమాఖ్య ఆర్టీసీ బస్సును కొనుగోలు చేయనుంది. అందుకోసం బ్యాంకు రుణం రూ.30 లక్షలు, మండల సమాఖ్య నిధుల నుంచి రూ.6లక్షలు మొత్తం రూ.36లక్షలు ముల్కనూరు బ్యాంక్ నుంచి టీజీఎస్ ఆర్టీసీ ఖాతాకు శుక్రవారం జమచేసినట్లు ఏపీఎం దేవానంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సమాఖ్యలకు బస్సుల కొనుగోలులో భాగంగా భరతమాత మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీల ఆర్థిక సాధికారత కోసం నూతన బస్సును కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రతీ నెల ఆర్టీసీ నుంచి రూ.77,220 అద్దె ఛార్జీలుగా మండల సమాఖ్యకు రానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు షబానా, రజిత, హైమావతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

కమలాపూర్ : మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఉప్పల్, దేశరాజుపల్లి గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన దంచికొట్టింది. దీంతో దేశరాజుపల్లి శివారులో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపడగా, 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు జూజునూర్‌పల్లిలో ఓ విద్యుత్ స్తంభం విరిగిపడగా స్పందించిన ఆ శాఖ సిబ్బంది తక్షణమే మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

